మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే




నాగోలు మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: రాబోయే రోజుల్లో మురికి కాలువల్లో సివరేజ్ కలవకుండా చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నాగోలు డివిజన్ పరిధిలోని జైపురి కాలనీ సమీపంలో ఉన్న ఎస్‌టీపీప్లాంట్‌లో జరుగుతున్న మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పహాడిషరీఫ్ నుంచి ఉస్మానియా హాస్పిటల్ నుంచి ఇక్కడ వరకు సివరేజ్ ఇక్కడికి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే సివరేజ్ మూసిలో కలవకుండా ట్రీట్మెంట్ ప్లాంట్ కు డైవర్ట్ చేసి అక్కడ ట్రీట్మెంట్ చేసి స్వచ్ఛమైన నీటిని మూసిలోకి వదులుతారన్నారు.

విద్యార్థులకు షరతులు లేకుండా అడ్మిషన్లు ఇవ్వాలి

సైదాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి షరతులు లేకుండా అడ్మిషన్లు ఇవ్వాలని సైదాబాద్ మండల బాలల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ షేక్ మహమూద్ కోరారు. శుక్రవారం ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలో వేదిక ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో షిఫ్టింగ్ పద్ధతిలో తరగతులు నిర్వహిస్తుండటంతో పలువురు విద్యార్థులు డ్రాపవుట్ అవుతున్నారని అన్నారు. దాని వలన వారు బాల కార్మికులుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేసారు. పాఠశాలల్లో షిఫ్టింగ్ విధానాన్ని ఎత్తివేయాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

17 నుంచి తిరుప్పావై ప్రవచనోత్సవాలు



మలక్‌పేట: ఈనెల 17 నుంచి జనవరి 14 తేదీ వరకు మూసారంబాగ్ ఆండాళ్ నిలయంలో ప్రతీ రోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు 37వ,తిరుప్పావై ప్రవచనోత్సవములు కొనసాగుతాయని నిర్వాహకురాలు, భగవత్ దాసురాలు లక్ష్మీదేవి తెలిపారు. భక్తులు హాజరై స్వామి వారికి కృపకు పాత్రులు కావాలని ఆమె కోరారు. వివరాలకు 86881 57009 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలి



పారిశుద్ధ్య కార్మికులకు కిట్‌లను పంపిణీ చేస్తున్న లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటనే కాలనీలు శుభ్రంగా ఉంటాయని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సేఫ్టీ కిట్లను శుక్రవారం సచివాలయనగర్‌లోని వార్డు కార్యాలయంలో లచ్చిరెడ్డి అందజేశారు. పారిశుద్ధ్య కార్మికులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. జీహెచ్‌ఎంసీ ఎస్‌ఎస్ అజీముద్దీన్, నాయకులు విష్ణువర్ధన్, పవన్‌రెడ్డి, పురుషోత్తం, బాలకృష్ణ, చంద్రశేఖర్, ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ద్వారా మహిళలందరికీ లబ్ధి చేకూరుతుందని, దీని ద్వారా నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి డిమాండ్‌చేశారు. ఆటో సంఘాల ఆధ్వర్యంలో చైతన్యపురిలో శుక్రవారం జరిగిన ఆటో డ్రైవర్ల సమ్మెకు బద్దం మద్దతు పలికారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న వారికి ప్రభుత్వం చేయూత ఇవ్వాలన్నారు. ఆటో సంఘాల నాయకులు కేశవ్, రూపాల్, స్థానిక నాయకులు దాసరి జయప్రకాష్, శ్రవణ్, సతీష్, మురళి, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

పీపీఈ సేఫ్టీ కిట్ల పంపిణీ



వనస్థలిపురం: పారిశుద్ధ్య కార్మికులు విధి నిర్వహణలో అనారోగ్యాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని కమలానగర్‌లో పారిశుద్ధ్య కార్మికులకు ఆయన పీపీఈ సేఫ్టీ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్ లక్ష్మయ్య, సూపర్‌వైజర్ రాజ్‌కుమార్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



విద్యుత్ శాఖ ఎస్‌ఈ కరుణాకర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్

నాగోలు: డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, కొత్త పోల్స్ ఏర్పాటు చేయాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ విద్యుత్ శాఖ అధికారులను కోరారు. శుక్రవారం విద్యుత్ ఏఈ కరుణాకర్ బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్ర నాథ్ యాదవ్ మాట్లాడుతూ నాగోల్ డివిజన్‌లో అనేక కొత్త కాలనీలు విస్తరిస్తున్నాయి అక్కడ కొత్త ఎలక్ట్రికల్ పోల్స్ ఏర్పాటు చేయాలని కోరారు.

అందుబాటులోకి రాజీవ్ 'ఆరోగ్యశ్రీ'



వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన మహిళలు

చాదర్‌ఘాట్: పేద మధ్యతరగతి ప్రజలు ప్రైవేటు దవాఖానాలకు వెళ్లి చికిత్సలు పొందాలంటే ఆర్థిక పరిస్థితులు అడ్డొచ్చి ఆలోచించాల్సిన పరిస్థితులు తలెత్తేవి. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరెడ్డి రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొచ్చారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో కూడా సామాన్యుడికి ఉచితంగా చికిత్స పొందే అవకాశాన్ని కల్పించారు. రేషన్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరు ఆరోగ్యశ్రీ పథకానికి అర్హులు.

- ' మలక్‌పేట నియోజకవర్గం పరిధిలోకి వచ్చే ఓల్డ్‌మలక్‌పేట, అజంపురా, చావుని, సైదాబాద్, అక్బర్‌బాగ్, మూసారాంబాగ్‌లకు చెందిన 67673 మందికి రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందే అవకాశం ఉంది. 1672 వ్యాధులకు రూ. 10లక్షల వరకు తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి వచ్చాక ఇచ్చిన పథకం ద్వారా లబ్ధిపొందే అవకాశం కల్పించారు.

రూ. 10లక్షలకు పెంపుపై సర్వత్రా హర్షం

పథకం ప్రారంభించినప్పుడు రూ. 2లక్షల వరకు ఎలాంటి ఖర్చులు లేకుండా ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స అవకాశం కల్పించారు.' ఆరోగ్యశ్రీ తరహాలోనే కేంద్రం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేస్తుంది. ఈ రెండు పథకాలను కలిసి రూ. 5లక్షలు వరకు వైద్య సేవలు పొందే అవకాశం ఉండేది. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

- మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఆరోగ్యశ్రీ పథకాన్ని మళ్లీ రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంగా మారుస్తూ పరిధిని రూ.10 లక్షలకు పెంచుతూ చేయూత పేరుతో శనివారం ప్రారంభించనున్నారు.
- 289 వ్యాధులకు, సర్జికల్ విభాగంలో 1383 వ్యాధులకు రూ. 10 లక్షల వరకు చికిత్స పొందవచ్చు. 126 రకాల వ్యాధిగ్రస్తులకు చికిత్స అనంతరం సంవత్సరం పాటు ఉచితంగా మందులు అందించనున్నారు.

ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని ఉపయోగించుకోవాలి



ఉచిత న్యాయ సలహా కేంద్రం ప్రారంభం సందర్భంగా మాట్లాడుతున్న మధుయాష్కిగౌడ్

దిల్‌సుఖ్‌నగర్: ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు ఉచిత న్యాయ సలహా కేంద్రం ఏర్పాటు చేసినట్లు , ఈ ఉచిత న్యాయ సలహా కేంద్రం సేవలు వినియోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్, ఎల్‌బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మధుయాష్కిగౌడ్ అన్నారు. శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని శివపురికాలనీలో మధుయాష్కి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని ప్రారంభించారు. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ఇక్కడి ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల మధ్య, ప్రతి శనివారం ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకు న్యాయ నిపుణులు అందుబాటులో ఉంటరని తెలిపారు. ఈ న్యాయ సలహా కేంద్రాన్ని హైకోర్టు న్యాయవాది, తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ చలకాని వెంకట్ యాదవ్ సమన్వయం చేస్తారని తెలిపారు. న్యాయవాదులు దాసరి శ్రీనివాస్, ప్రదీప్, ఊర్మిళ, లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వజీర్ ప్రకాష్‌గౌడ్, అనంతుల సురేందర్‌రెడ్డి, లింగాల కిషోర్‌గౌడ్, నవీన్, దేరింగిల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడి పూజ

నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని సాయి నగర్ కాలనీలో శుక్రవారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త పాల్గొని అయ్యప్ప స్వామి దీవెనలు తీసుకున్నారు. కార్యక్రమంలో పిలాయిపల్లి కిరణ్, పిల్లాయిపల్లి నర్సింగరావు, అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

రైతుబజార్ ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 19. వంకాయ 45, బెండ 55, పచ్చిమిర్చి35, కాకర 55, బీర 55, కాలిఫ్లవర్ 23, క్యాబేజీ 13, కారెట్ 28. దొండ 65, ఆలు 23, ఉల్లి 35, గోకర 55, దోస 28, సొర 13, పొట్ల 13, అరటి 10, చిక్కుడు 65, అర్వి 50, మునగ 85, చిలగడదుంప 50, బీట్‌రూట్ 27, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 60, కాప్సికమ్ 50. ఈధరలు శనివారం 9 గంటల వరకు ఈధరలు అమలులో ఉంటాయి.

బాక్స్ డ్రైనేజ్ పనులు వెంటనే పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్ నాగేశ్వర్‌రావు కాలనీలో బాక్స్ డ్రైనేజ్ పనులు వెంటనే పూర్తి చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అధికారులను కోరారు. శుక్రవారం కొత్తపేట డివిజన్‌లోని నాగేశ్వర్‌రావు కాలనీలో బాక్స్ డ్రైనేజ్ పనులను కార్పొరేటర్ పవన్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాక్స్ డ్రైనేజ్ పనులు మధ్యలో సగం వదిలిపెట్టడతంతో అకస్మాత్తుగా ఎవరైనా గుంతలో పడే ప్రమాదం ఉందని అన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

కాలనీలు శుభ్రంగా వుండేలా చూడాలి

కొత్తపేట డివిజన్ పరిధిలో అన్ని కాలనీలో శుభ్రంగా ఉండాలని ఎక్కడ కూడా చెత్త కుప్పలు లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్‌కుమార్ శానిటైజేషన్, రాంకీ సంస్థ సూపర్‌వైజర్లకు సూచించారు.

ఫిల్మ్ సెన్సార్ బోర్డు సలహా మండలి సభ్యుడిగా మూర్తి



వనస్థలిపురం: కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు హైదరాబాద్ ప్రాంత సలహా మండలి సభ్యుడిగా సామాజిక వేత్త, వనస్థలిపురం భక్త సమాజం వ్యవస్థాపకులు ఎన్జీవోస్ కాలనీకి చెందిన సీహెచ్‌వీఆర్‌కే.మూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర సమాచార ప్రసార శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

నిరుద్యోగ యువతకు నేడు జాబ్ మేళా

అల్వాల్: మేడ్చల్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 16న శనివారం ఉదయం జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలోని రూమ్ నెంబర్-9లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.వై. నిర్మల తెలిపారు. రిలయన్స్ జియో హైదరాబాద్ ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. జియో పాయింట్ అసిస్టెంట్ మేనేజర్, ఎంటర్‌ప్రైజ్ సేల్స్ ఆఫీసర్స్, జియో డిజిటల్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఉన్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఇంటర్, డిప్లమోతో పాటు డిగ్రీ చదివి ఉండాలన్నారు. ఆసక్తిగల యువతీ యువకులు www.nic.gov,in లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 7386809422 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

కుషాయిగూడ: నియోజకవర్గ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన చర్లపల్లి డివిజన్, సాయినగర్ కాలనీలోస్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవితో కలిసి సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఎల్ఆర్ మాట్లాడుతూ స్థానిక సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో చర్చించి నివేదికలు సిద్ధం చేయిస్తున్నట్లు తెలిపారు. దశలవారీగా నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయడంతో పాటుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, నారెడ్డి రాజేశ్వర్ రెడ్డి, నేమూరి మహేష్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, అనిల్ ముదిరాజ్, జొండ్ల సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

కాచిగూడ: పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీలా వెంకటేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ఈ నెల 13, 14వ తేదీల్లో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నా, ఆందోళన కార్యక్రమాల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి వందలాదిగా బీసీలు తరలివెళ్లి పూర్తిస్థాయిలో విజయవంతం చేశారని ఆయన అన్నారు. ఢిల్లీలో జరిగిన ధర్నా కార్యక్రమంలో పాల్గొని నగరానికి చేరుకున్న సందర్భంగా శుక్రవారం కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద బీసీ సంఘాల, కుల సంఘాల ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు. బీసీల న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యేంత వరకు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ఉద్యమం కొనసాగుతుందన్నారు. ముదిరాజ్ ఐక్యవేదిక అధ్యక్షుడు జి.అనంతయ్య, విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ శివకృష్ణ, యాదవ సంఘం అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, రజక సంఘం రాష్ట్ర నాయకులు గణేష్, గౌడ సంఘం రాష్ట్ర నాయకులు కోనూరు గణేష్ గౌడ్, సాయికిరణ్ పాల్గొన్నారు.

పనులు ఆపారు.. సమస్య మరిచారు

- అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు
- జనప్రియ మహానగర్‌లో నిర్మాణానికి బ్రేక్
- తీవ్ర అవస్థలు పడుతున్న స్థానికులు



జనప్రియ మహానగర్‌లో అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు

మీర్‌పేట: రోడ్డు పనులు అసంపూర్తిగా వదిలేయడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నత్తకు నడక నేర్పిన చందంగా అధికార యంత్రాంగం పనుల విషయంలో జాప్యం వహిస్తోంది. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని జనప్రియ మహానగర్‌లో మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షానికి వరదనీరు ముంచెత్తడంతో ఓ వైపు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. తరువాత ముంపు సమస్య పరిష్కారానికి కాలనీ మీదుగా అధికారులు ట్రంక్‌లైన్ వేశారు. వాటి పనులు పూర్తయి సంవత్సరం గడిచినా రోడ్డును అభివృద్ధి చేయకపోవడంతో కాలనీవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దాదాపు 8 నెలల క్రితం బీటీ రోడ్డు వేసేందుకు గాను రూ.50 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. కాలనీ ముఖద్వారం నుంచి సగం వరకు రహదారి వేయించిన అధికారులు మిగతా సగం వేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. కొంత వరకు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ రెండు నెలలుగా నిలిపివేయడంతో జనప్రియ వాసులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. నిత్యం ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, కార్మికులు తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు శ్రమిస్తున్నారు.

పార్కింగ్‌కు అడ్డాగా..

అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు ఓ వైపు పూర్తిగా అందుబాటులో లేకపోవడంతో వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుతం మార్గం సైతం చిన్నగా ఉండడంతో వాహనాల రద్దీ ఎక్కువ అయింది. పనుల నిమిత్తం బయటికి వెళ్లే స్థానికులు రోడ్డు అసంపూర్తిగా ఉండడంతో చుట్టూ తిరిగి రావాల్సి వస్తుందని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. రహదారి ధ్వంసమైన చాలా కాలం తరువాత బీటీ రోడ్డు వేస్తుండడంతో సమస్య పరిష్కారం అవుతుందని అనుకునేలోపే కాంట్రాక్టర్ సగంలోనే వదిలేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మిగతా రోడ్డు పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

త్వరలో ప్రారంభిస్తాం..

ముడిసరకు కొరత వల్ల రోడ్డు పనులను మధ్యలోనే నిలిపివేయాల్సి వచ్చింది. విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. త్వరలోనే పనులు మొదలు పెడతాం. స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– శ్రీనివాస్, ఏఈ, మీర్‌పేట

'త్వరలో జాబ్ కేలెండర్'



మధుయాష్కీకి మొక్కను అందచేస్తున్న హాస్టల్ విద్యార్థులు

చంపాపేట: కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో జాబ్ కేలెండర్ ఏర్పాటు చేసి అర్హత కలిగిన నిరుద్యోగులకు ఉద్యోగ భరోసా కల్పించనున్నదని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ అన్నారు. శుక్రవారం చంపాపేట లోని ప్రభుత్వ బాలుర, బాలికల వికలాంగుల వసతి గృహంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మధుయాష్కీ జన్మదిన వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన మాధుయాష్కీ వసతి గృహంలో సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి విద్యార్థుల అభ్యర్థన మేరకు తన స్వంత ఖర్చులతో రెండు లక్షల విలువైన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్, సీసీ కెమెరాలు, సీలింగ్ ఫ్యాన్‌లు, వాషింగ్ మిషన్. ఇంటర్‌నెట్, ఇతర సామగ్రిని రెండు రోజులలో మధుయాష్కీ ఫౌండేషన్ తరపున అందచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వజీర్ ప్రకాష్‌గౌడ్ పాల్గొన్నారు.

తెలంగాణ విముక్తి ప్రదాత వల్లభాయ్ పటేల్



చాదర్‌ఘాట్: నిజాం కబంధహస్తాల నుండి తెలంగాణకు విముక్తి చేసిన స్ఫూర్తి ప్రదాత సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి కొనియాడారు. శుక్రవారం పటేల్ వర్ధంతి పురస్కరించుకొని ఓల్డ్‌మలక్‌పేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



కమ్యూనిటీ హాల్‌నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని ద్వారకానగర్‌కాలనీలో జరుగుతున్న కమ్యూనిటీ హాల్‌నిర్మాణ పనులను అధికారులతో కలిసి కార్పొరేటర్ సుజాతనాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాతనాయక్ మాట్లాడుతూ తమకాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనులలో ప్రజలు భాగస్వాములు కావాలని, ప్రజల భాగస్వామ్యంతో పనులు త్వరితగతిన పూర్తికావడమే కాకుండా పనులలో నాణ్యతా ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. ఏఈ హేమూనాయక్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాల్‌రెడ్డి, వర్క్ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, బిక్కునాయక్, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో మధుయాష్కీ జన్మదిన వేడుకలు



లింగోజిగూడ: టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీగౌడ్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉప్పల శ్రావణ్‌గుప్తా ఆధ్వర్యంలో లింగోజిగూడ డివిజన్‌లోని అనాథ ఆశ్రమంలో విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి విద్యార్థులతో కేక్ కట్ చేయించి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జూపల్లి ప్రవీణ్‌కుమార్, మోహన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



వనస్థలిపురం: టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ వనస్థలిపురం, బీఎన్ రెడ్డినగర్ డివిజన్ల అధ్యక్షులు కుట్ల నర్సింహాయాదవ్, మకుటం సదాశివుడుల ఆధ్వర్యంలో శుక్రవారం వనస్థలిపురంలో పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఖదీర్‌భాషా, నరేష్, శ్రీను, నరసింహా, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



చైతన్యపురి: మాజీ పార్లమెంటు సభ్యుడు మధుయాష్కి గౌడ్ జన్మదినం సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుడు దాము మహేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో చైతన్యపురిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టామన్నారు. గౌతంరెడ్డి, కోదూరు శ్రీనివాస్, విజయ్‌కుమార్, రాంబాబు, కుమార్, సతీష్ మాదిగ, సాయి, కిరణ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.